Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
11వ వార్షికోత్సవం ★ 2016 - 2026 ★
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 200
సంచిక : 300
పేజీలు : 4

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శనివారం, జులై 18, 2026

## నేడు మంత్రి పొంగులేటి చెక్కుల పంపిణీ



**టీ మీడియా, జులై 17 ,కూసుమంచి:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన క్యాంపు కార్యాలయం కూసుమంచి కి శనివారం ఉదయం 10.00 గంటలకు రానున్నారు. క్యాంపు కార్యాలయములో కూసుమంచి మండలానికి చెందిన సీ ఎం ఆర్ ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి తన చేతులు మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అయితే లబ్ధిదారులు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని తప్పనిసరిగా తీసుకురావాలి. కావున కూసుమించి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు సకాలంలో హాజరు కాగలరని మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు

# సమస్యల (సంపన్నుల) వలయంలో ఎదులాపురం మున్సిపాలిటీ



**-అనుమతి లేకుండా అంతస్తుల నిర్మాణాలు**

**- నివాస గృహాల్లో విద్యాసంస్థలు, అక్రమ వ్యాపారాలు**

**-చెత్తలో పడి స్వచ్ఛ భారత్ వాహనాలు**

**టీ మీడియా, జులై 17, ప్రత్యేక ప్రతినిధి:** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృషితో ఎదులాపురం పంచాయతీ మున్సిపాలిటీగా ఏర్పడింది. ఆయన చొరవతో కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అయితే, కొంతమంది సంపన్నుల నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనల కారణంగా ఈ ప్రాంతం సమస్యల వలయంలో చిక్కుకుంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బీబీఎం (భారత్ బాల మందిర్) పాఠశాల యాజమాన్యం సంబంధిత అనుమతులు లేకుండానే అదనపు అంతస్తుల నిర్మాణం చేపడుతున్నప్పటికీ, అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.అలాగే, విద్యాశాఖ అనుమతి లేకుండా మరో పాఠశాల నివాస గృహంలో నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.వరంగల్ క్రాస్ రోడ్ సమీపంలోని ఓ నివాస గృహంలో యంత్రాలు ఏర్పాటు చేసి, నిబంధనలకు విరుద్ధంగా పాల నుంచి వెన్న తయారీ జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా చిరునామాతో ఉన్న జీఎస్టీ లైసెన్స్ ఆధారంగా స్థానికంగా లక్ష్మీ పరిశ్రమల్లో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం.అదేవిధంగా, మద్యం దుకాణాల లైసెన్సుల్లో పేర్కొన్న ఇంటి నంబర్లపై కూడా అనుమానాలువ్యక్తమవుతున్నాయి.క్రాస్ రోడ్ వద్ద స్వచ్ఛ భారత్ మిషన్‌కు చెందిన చెత్త సేకరణ వాహనాలు చెత్త కుప్పల్లోనే కనిపించడం విమర్శలకు తావిస్తోంది. మున్సిపాలిటీలో పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అంశాలపై మున్సిపల్ కమిషనర్‌ను గురువారం వివరణ కోరగా, శుక్రవారం రావాలని సూచించారు. శుక్రవారం సంప్రదించగా, సోమవారం కలవాలని సూచించారు.

**మున్సిపాలిటీ చరిత్ర**

ఎదులాపురం ఖమ్మం నగరానికి ఆనుకుని ఉన్న పురాతన గ్రామం. ఒకప్పుడు ఇది పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామ పంచాయతీ. వరి, పత్తి, మిర్చి వంటి పంటలు ప్రధానంగా సాగు చేసేవారు. ఖమ్మం పట్టణం విస్తరించడంతో ఎదులాపురంలో నివాస కాలనీలు, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు వేగంగా పెరిగాయి.

ఈ అభివృద్ధి నేపథ్యంలో గ్రామ పంచాయతీగా కొనసాగడం కంటే పట్టణ స్థానిక సంస్థగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం 2024లో ప్రతిపాదనను ప్రారంభించి, 2025లో మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. అనంతరం 2026లో తొలి మున్సిపల్ ఎన్నికలు జరిగాయి.

**అభివృద్ధి ప్రయాణం**

గ్రామ పంచాయతీగా ప్రారంభం.సిమెంట్ రోడ్లు, తాగునీటి పథకాల విస్తరణ.కొత్త కాలనీలు, వెంచర్లు ఏర్పాట్లు.విద్యాసంస్థలు, ఆస్పత్రులు పెరుగుదల.ఖమ్మం నగర విస్తరణతో రియల్ ఎస్టేట్ అభివృద్ధి.మున్సిపాలిటీ హోదా సాధన. అభివృద్ధిలో వివిధ కాలాల్లో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ వంతు పాత్ర పోషించారు. మున్సిపాలిటీ ఏర్పాటుకు స్థానిక ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ



అధికారులు కలిసి కృషి చేశారు.

**ప్రధాన సమస్యలు**

వర్షాకాలంలో నీటి నిల్వలు,డ్రైనేజీ సమస్య,తాగునీటి కొరత,ట్రాఫిక్ సమస్య,చెత్త నిర్వహణలో లోపాలు,అక్రమ నిర్మాణాలు,ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆరోపణలు,పార్కుల కొరత,యువతకు క్రీడా మైదానాల అవసరం .

**అనుమతిలేని నిర్మాణాలు**

మున్సిపాలిటీ నుంచి భవన అనుమతి తీసుకోకుండా ఇళ్లు లేదా వాణిజ్య భవనాలు నిర్మించడం.

అనుమతి ఉన్నప్పటికీ ఆమోదించిన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం.

3లో

# సమగ్రంగా, పారదర్శకంగా భూ రీ-సర్వే

**-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**టీ మీడియా,జులై17,తిరుమలాయపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ రీ-సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమగ్రంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు.శనివారం పాలేరు నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును పరిశీలిస్తూ రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియపై రైతులు వ్యక్తం చేసిన సందేహాలు, సమస్యలను ఓర్పుతో విని వాటిపై స్పష్టమైన వివరణ ఇచ్చి నివృత్తి చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, ప్రతి పట్టాదారు భూమిని సంబంధిత భూ యజమానులు, రైతుల సమక్షంలోనే సర్వే చేసి, సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.భూ రీ-సర్వేపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ అన్నారు. గ్రామస్థులు అడిగే ప్రతి సందేహానికి వెంటనే సమాధానం ఇచ్చి వారికి విశ్వాసం కల్పించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ భూ



రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, అధునాతన సాంకేతిక ప్రమాణాలతో నాణ్యమైన సర్వే నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భూ రీ-సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రైతులకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి రైతు తన భూమికి సంబంధించి ఖచ్చితమైన రికార్డులు పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆనతరం తిరుమలాయపాలెం మండలంలో సీతారామ ప్రాజెక్టు లో భాగంగా నిర్మిస్తున్న టన్నెల్ పనులను బీరోల్ వద్ద కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఇరిగేషన్ డిఈ రమేష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికుల ఆందోళన

**ఎంపీడీఓకు సీఐటీయూ వినతిపత్రం**



**టీ మీడియా, జులై 17, ఎర్రుపాలెం :** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో మిషన్ భగీరథ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని నిలువరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ.. మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో 41 మంది మిషన్ భగీరథ కార్మికులు ఎల్ అండ్ టీ ఏజెన్సీ ద్వారా దశాబ్దాలుగా సేవలందిస్తున్నారని తెలిపారు. అయితే ఆధార్ కార్డు వెరిఫికేషన్ ప్రక్రియలో ఇక్కడ పని చేయని 14 మంది కొత్త కార్మికుల పేర్లు జాబితాలో చేర్చడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వారు ఎక్కడ పని చేస్తున్నారో అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను నిర్లక్ష్యం చేస్తూ అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కొత్తగా చేర్చిన కార్మికుల పేర్లను వారు పనిచేస్తున్న సంబంధిత మండలాల వెరిఫికేషన్ జాబితాలో చేర్చి అక్కడే ధృవీకరణ చేపట్టాలని కోరారు.మిషన్ భగీరథ కార్మికులకు ఏజెన్సీ ద్వారా వేతనాలు సకాలంలో అందడం లేదని, ప్రభుత్వం మంజూరు చేస్తున్న వేతనాల్లో కోతలు విధించి అరకొర వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వం నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లించే విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ తగిన వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ ఆందోళనలో బేతి శ్రీనివాసరావు, కొండూరు నాగేశ్వరరావు, రామారావు, భాస్కర్‌రావు, మోహన్‌రావు, అబ్రహాం, సాంబయ్య, నాగేశ్వరరావు, సురేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**-ఎంపీలు రేణుక చౌదరి, రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారె**

**టీ మీడియా, జూలై 17, దమ్మపేట :**దమ్మపేట మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రరాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుక చౌదరి గారులి,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి , మరియు అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు లిశ్రీ జారె ఆదినారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దమ్మపేట మండల కేంద్రంలో రూ. 35 లక్షల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన నూతన లైబ్రరీ (గ్రంథాలయ) భవన నిర్మాణానికి నేతలు అధికారికంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో రాహుల్ , మునిసిపల్ చెర్మన్ జూపల్లి రమేష్ బాబు,గ్రంథాంధాలయం చైర్మన్ వీరబాబు ఆత్మ కమిటీ చైర్మన్ వీరభద్రం, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి , కేకీరాల రమేష్ ,,కాక రమేష్ , స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## సర్ లో బి ఆర్ ఎస్ శ్రేణులు పాల్గొనాలి: గుండాల కృష్ణ.

**టీ మీడియా, జూలై 17, ఖమ్మం :**నగరంలోని పలు డివిజన్ లలో జరుగుతున్న సర్ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ శ్రేణులు ఉత్సాహం గా పాల్గొనాలని ఆపార్టీ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ సూచించారు ఖమ్మం ఉమెన్స్ కాలేజీ లో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని, 35వ డివిజన్ పరిధిలోని ఆంజనేయ స్వామి దేవాలయం లో జరిగిన కార్యక్రమాన్ని సందర్శించి ఎన్యు మరేషన్ కార్యక్రమం జరుగుతున్న తీరును స్థానిక బి ఎల్ ఓ ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు అందరూ ఎన్యుమరేశన్ ఫారాలు నింపి ఇవ్వాలని సూచించారు.ఫారాలు నింపేందుకు బి ఎల్ ఓ లు సహకరించాలని అన్నారు.అదేవిధంగా అర్హులైన వారిది ఒక్క ఓటు పోకుండా,రెండు ఓట్లు ఉన్నవారి ఓటు తొలగించేలా బిఎల్ ఓ లు పకడ్బందీ గా ఫారాలు పూర్తి చేయాలని కోరారు.ఫారాలు నింపేందుకు సమయాన్ని ఆగష్టు 3 వరకు పెంచినందున ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పార్టీ బి ఎల్ ఏ లు కూడా ఫారాలు నింపేందుకు ప్రజలకు సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్,బి ఆర్ ఎస్ నాయకులు బొజెడ్ల రామ్మోహన్, మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు

**-వ్యవసాయ శాఖ అధికారి బాబురావు**

**టీ మీడియా, జూలై 17, అన్నపురెడ్డిపల్లి :**వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకొని వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, కూరగాయల పంటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచించారు.శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేపట్టాలని, వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ), వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# ఆపద్బాంధవుల సాహసం..

**-డోలీ మోతతో ప్రాణాలు**

**కాపాడిన 108 సిబ్బంది**

**టీ మీడియా, జూలై 17, ములుగు:**ప్రభుత్వాలు మారుతున్నా మారుమూల గిరిజన ప్రాంతాల సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. కనీస రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లోనూ రోగులను డోలీలపై మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో విధినే దైవంగా భావించిన 108 అంబులెన్స్ సిబ్బంది అసాధారణ సాహసం చేసి ఓ యువకుడి ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు.ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటిడిఎ పరిధిలోని గుర్రాలబావి గ్రామానికి చెందిన గొత్తికోయ గిరిజన యువకుడు మడకం అయితయ్య (18) గత నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడక, పరిస్థితి విషమించడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు.దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శివలింగం ప్రసాద్, పైలట్ కోటి హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. అయితే గ్రామానికి వెళ్లే రహదారి లేకపోవడంతో అంబులెన్స్ ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.అయినా వెనుకడుగు వేయని 108 సిబ్బంది బురదతో నిండిన కాలిబాటలో నడుచుకుంటూ గ్రామానికి చేరుకుని, గ్రామస్థుల సహాయంతో బాధితుడిని డోలీలో మోసుకుంటూ ప్రధాన రహదారి వరకు తీసుకొచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా రక్తంలో చక్కెర స్థాయి ప్రమాదకరంగా పడిపోవడంతో పాటు తీవ్ర జ్వరం ఉన్నట్లు గుర్తించారు.ఈఆర్సీపీ డాక్టర్ మౌనిక సూచనల మేరకు అత్యవసర చికిత్సగా గ్లూకోజ్, అవసరమైన మందులు, ఇంజెక్షన్లు అందించి, వెంటనే ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి



పరిస్థితిని వైద్యులకు పూర్తిగా వివరించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.కనీస రహదారి సౌకర్యం లేకపోయినా ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో విధులు నిర్వహించిన 108 అంబులెన్స్ సిబ్బంది సేవలను స్థానికులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ప్రశంసించారు. ఇలాంటి సేవాభావంతో పనిచేస్తున్న 108 సిబ్బంది నిజమైన ఆపద్బాంధవులని కొనియాడుతూ, మారుమూల గిరిజన గ్రామాలకు తక్షణమే రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# స్మార్ట్ కిడ్జ్ లో మొక్కలు నాటిన చిట్టి చేతులు

**-ఆనంద ఉత్సవాలతో వన మహోత్సవ సంబురం**

**టీ మీడియా, జూలై 17, ఖమ్మం :**స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆవరణం శుక్రవారం చిట్టి చేతుల వన మహోత్సవ సంబరంలో మురిసిపోయింది. చిన్నారులు వనమహోత్సవ వేడుకను ఆనందోత్సవాలతో నిర్వహించారు. పాఠశాల చిన్నారులు పాఠశాల మైదానంలో, రహదారులకు ఇరువైపులా పలు రకాల మొక్కలను నాటారు. నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు, అందంగా పూలతో ఉండే మొక్కలు, తదితర వివిధ రకాల మొక్కలను నగరంలోని వేరువేరు ప్రాంతాలలో నాటారు. మొక్కలతో నగరంలో పాఠశాల విద్యార్థులు వనమహోత్సవ చైతన్య ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన విద్యార్థులు ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల గుండా నిర్వహించి ప్రజలను వనమహోత్సవం గురించి చైతన్యపరిచారు. పాఠశాలలో మొక్కల ప్రయోజనాలను వివరిస్తూ ఇద్దరు విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటిక అందరిని ఆలోచింపజేసింది. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య వనమహోత్సవ ర్యాలీని ప్రారంభించగా ఖమ్మం కార్పొరేషన్ హార్టికల్చర్




అధికారిని రాధిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారిని రాధిక మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సంకల్పంతో నిర్వహించాలని కోరారు. మొక్కలు పెంచడం ద్వారా మనకు దీర్ఘకాలంగా ప్రాణవాయువు లభిస్తుందని పేర్కొన్నారు. స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు వనమహోత్సవాన్ని వేడుకోగా నిర్వహించడం ద్వారా ఇతర పాఠశాలల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం సామాజిక బాధ్యతతో నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలోని పెరిగిన చెట్లు తమ పాఠశాల విద్యార్థులు గతంలో నాటిన మొక్కల వల్లనే ప్రయోజనం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి ముందు తమ పుట్టినరోజున తప్పనిసరిగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. అనంతరం విద్యార్థులందరికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మసూద్ మృతి పార్టీకి తీరని లోటు

**ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**టీ మీడియా, జూలై 17, కొత్తగూడెం:**మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు మసూద్ మరణం పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటు అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఇటీవల ఎస్ కే. మసూద్ గుండె పోటుతో మరణించారు. ఈ రోజు వారి స్వగృహానికి వెళ్ళి మసూద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మసూద్ సతీమణి 54వ డివిజన్ కార్పొరేటర్ నళినీ జయంతి మసూద్ మరియు కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మసూద్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మసూద్ మరణం పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటు అని, మసూద్ దంపతులు ప్రజలకు చేసిన సేవలు మరువలేవని, మైనారిటీ వర్గాల కబరస్థాన్ స్థలం కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. అనంతరం అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ నాయకులు సురేష్ ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రామవరంలో కరెంట్ షాక్ తో మరణించిన కాంగ్రెస్ యువ నాయకులు కళ్యాణ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. బాబు క్యాంప్ నకు చెందిన అడేపు విజయ లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, కొత్వాల శ్రీనివాస రావు, మాజీ జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్ర శేఖర్ రావు, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జానీ



పాషా, మంద హనుమంత రావు, కొదుమూరి శ్రీనివాస్ రావు, జిల్లా జనరల్ సెక్రటరీ లు పెద్ద బాబు, నాగార్జున, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఐఎన్ టీఎంసీ నేత రజాక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, పట్టణ, మండల కాగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ యాదవ్, దేవగడ్ల ప్రసాద్, జేమ్స్ సునీల్, భువన సుందర్ రెడ్డి, చింతలపూడి రాజ శేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డల రమేష్, కార్పొరేటర్లు, సర్పంచ్ లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## కోర్టులో మౌలిక వసతుల కల్పనకు విజ్ఞప్తి

**టీ మీడియా, జూలై 17, దమ్మపేట:** జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దమ్మపేట బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లోని రాష్ట్ర హైకోర్టులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోర్ట్‌ఫోలియో న్యాయమూర్తులు జస్టిస్ జె.శ్రీనివాసరావు, జస్టిస్ కె.శరత్‌లను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దమ్మపేట కోర్టులో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దమ్మపేట కోర్టులో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, తీవ్రంగా ఉన్న కోర్టు ఉద్యోగుల కొరతను నివారించాలని వారు కోరారు. అలాగే దమ్మపేటలో నూతనంగా సబ్ కోర్టు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలని, అలాగే కోర్టు ఆవరణలో న్యాయదేవత విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ సభ్యుల వినతులపై జస్టిస్ జె.శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారని ప్రతినిధులు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన వారిలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్, జనరల్ సెక్రటరీ లక్కినేని నరేంద్రబాబు, హైకోర్టు న్యాయవాది పెనుబల్లి రమేష్, ట్రెజరర్ తామ బాలరాజు, గేమ్స్ సెక్రటరీ తీర్నతి సంజయ్ ఉన్నారు.



# ఇసుక అక్రమ రవాణా

**ఏడుగురిపై కేసు నమోదు**

**టీ మీడియా, జూలై 17, బూర్గంపహాడ్:** అక్రమంగా డంప్ చేసిన ఇసుకను తోడుతున్న జేసీబీతో పాటు ఇసుక తరలిస్తున్న లారీని గురువారం రాత్రి పట్టుకున్నట్లు బూర్గంపహాడ్ పోలీసులు తెలిపారు. ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీపురంలో బుద్ధగూడెం నుండి డంప్ చేసిన ఇసుకను జేసీబీ సహాయంతో లారీలో లోడ్ చేసి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో అక్కడకు వెళ్లి లారీ, జేసీబీని స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా దీనికి కారణమైన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, అక్రమంగా ఇసుక తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

## సమస్యల (సంపన్నుల) వలయంలో

నివాస భవనాలను అనుమతులు లేకుండా పాఠశాలలు, హాస్టళ్లు, గోదాములు లేదా వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం. సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టడం.

తలెత్తే సమస్యలు:డ్రైనేజీ వ్యవస్థపై అదనపు భారం.ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలు.వర్షాకాలంలో నీటి నిల్వలు.అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఇబ్బందులు.తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై ఒత్తిడి.

**ప్రజలు కోరుతున్నవి**

శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ,అన్ని కాలనీలకు సీసీ రోడ్లు,24 గంటల తాగునీరు,ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి,ప్రభుత్వ జూనియర్ కళాశాల,పార్కులు,కమ్యూనిటీ హాల్,బస్ సౌకర్యాల విస్తరణ.

# గిరిజన హాస్టళ్లలో నాసిరకం సరుకులపై ఆగ్రహం

**జీసీసీ సరఫరాలను వెంటనే నిలిపివేయాలి..**

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై సీపీఎం విమర్శ**



**టీ మీడియా,జులై17,సింగరేణి(కారేపల్లి):** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం విమర్శించారు.విద్యారంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని,గిరిజన సంక్షేమ హాస్టళ్లు ,రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.శుక్రవారం కారేపల్లి మండలంలోని గాంధీనగర్ గిరిజన రెసిడెన్షియల్ స్కూల్ను సీపీఎం నాయకుల బృందం సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది.అనంతరం పాఠశాల ఆవరణ,వంటశాల,భోజనశాల,హాస్టల్ వసతులను పరిశీలించింది.ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ,జీసీసీ ద్వారా గిరిజన హాస్టళ్లకు సరఫరా చేస్తున్న కారం పొడి,పసుపు,చింతపండు వంటి నిత్యావసర సరుకులు నాసిరకంగా ఉన్నాయని,వాటిని వెంటనే ఉపసంహరించి నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ విషయాన్ని భద్రాచలం జీసీసీ జనరల్ మేనేజర్ సమ్మయ్య దృష్టికి తీ ు ు ెకె ్లి న ట ్లు తెలిపారు.అలాగే సివిల్ సప్లైస్ ద్వారా అందిస్తున్న బియ్యం కూడా నాణ్యమైనదిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.గిరిజన విద్యార్థుల ఆరోగ్యంతో రాజీపడకుండా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.పాఠశాల భద్రత కోసం వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని,తాగునీరు, మరుగుదొడ్లు,హాస్టల్,తరగతి గదులు తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం సీపీఎం నాయకులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు.భోజనంలో నాణ్యత మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్,వార్డెన్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు,మండల నాయకులు తలారి దేవప్రకాశ్,రేగళ్ల మంగయ్య, కేశగాని ఉపేందర్,ఎండి ఇస్మాయిల్,యనమనగండ్ల రవి,బానోత్ కిషన్ నాయక్,కరకమల్లు రాయమల్లు,ధారావత్ వినోద్ కుమార్,ఎజు రత్నం,రాచర్ల రణధీర్,పచ్చిపాల యాకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సమ సమాజ స్థాపనే రేపాకుల లాలయ్యకు నిజమైన నివాళి

**పి. సోమయ్య**




**టీ మీడియా, జులై17, సింగరేణి (కారేపల్లి):** ఆర్థిక,సామాజిక అసమానతలను తొలగించి సమ సమాజ స్థాపన కోసం ప్రజలను చైతన్యపరచి ఉద్యమించడం ద్వారానే సీపీఎం సీనియర్ నాయకుడు రేపాకుల లాలయ్యకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని సీపీఎం రాష్ట్ర నాయకులు పి.సోమయ్య అన్నారు.మాణిక్యారం గ్రామంలో రేపాకుల లాలయ్య రెండో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభకు పార్టీ శాఖ కార్యదర్శి పోతర్ల నాగయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పి.సోమయ్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా సంపద కొద్దిమంది కార్పొరేట్ శక్తుల చేతుల్లో కేంద్రీకృతమవుతోందని,ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్మికులు,రైతులు,వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రైవేటీకరణ,నిరుద్యోగం,ధరల పెరుగుదల, మహిళలపై పెరుగుతున్న దాడులు,ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు.రైతులకు పంటలకు గిట్టుబాటు ధర చట్టం అమలు చేయకపోవడం ,పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందన్నారు.ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచి ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.అనంతరం పి.సోమయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం,మెరుగు సత్యనారాయణ రేపాకుల లాలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం మాణిక్యారం గ్రామంలో లాలయ్య స్థూపం వరకు ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు,మెరుగు రమణ,మండల కార్యదర్శి కే.నరేంద్ర,డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు,కొండబోయిన ఉమావతి,మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సులు, భారీ వాహనాలపై ప్రత్యేక తనిఖీలు

**టీ మీడియా, జూలై 17, భద్రాద్రి కొత్తగూడెం :**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, విద్యార్థుల భద్రత మరియు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు స్కూల్ బస్సులు, భారీ వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్కూల్ బస్సులు, భారీ వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్ మరియు ఇతర సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేవీఆర్ కాలేజ్ భద్రాచలం బస్సు డ్రైవర్ ఎస్ భాస్కర్ మరియు ఎస్ఆర్డీజీ జూనియర్ కాలేజ్ కొత్తగూడెం బస్ డ్రైవర్ అజయ్ కుమార్ మద్యం సేవించి వాహనం నడుపుతూ ఈ తనిఖీల్లో పట్టు పడడం జరిగింది. వారిపై సెక్షన్ 185 యమ్.వి యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైనచర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో మొత్తం 185 కేసులు నమోదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపినట్లయితే మోటారు వాహనాల చట్టం సెక్షన్ 185 యమ్.వి యాక్ట్ ప్రకారం నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అలాగే డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, వాహనాలను అతివేగంగా నడపరాదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలను నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.



# మధ్యాహ్న భోజన కార్మికురాలిని విధుల్లోకి తీసుకోవాలి

**టీ మీడియా, జూలై 17, దమ్మపేట :** దమ్మపేట మండలంలోని నాయుడుపేట పాఠశాలలో తొలగించిన మధ్యాహ్నం భోజన కార్మికురాలిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్న ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయుడుపేట పాఠశాలలో కె.నాగమణి గత 12 సంవత్సరాలుగా వంట చేస్తుందని తెలిపారు. కాగా కొంతమంది గ్రామస్తులు ఆమెను అడ్డుకుని బలవంతంగా విధుల నుండి తొలగించటం దుర్మార్గమన్నారు. ఈ విషయమై ఎంఈఓ జగపతికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నాగమణిని వంట కార్మికురాలుగా విధుల్లోకి తీసుకోవాలని అలాగే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు, రామకృష్ణ, సత్యవతి, ఈశ్వరమ్మ, పార్వతి, వెంకటలక్ష్మి, భూదెమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.



# సిండికేట్‌పై చర్యలు ఎక్కడ..?

### ఎక్సైజ్ శాఖ మౌనం ఎందుకు..?

**టీ మీడియా,జులై17,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో అక్రమ బెల్ట్ షాపుల వ్యవహారంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం సిండికేట్‌పై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ ఇప్పటికీ స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలు, తండాల్లో బెల్ట్ షాపులు యథావిధిగా కొనసాగుతుండగా,ఎమ్మార్పీ ధర కంటే ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగ దారులు చెబుతున్నారు. బహిరంగంగానే ఈ వ్యాపారం సాగుతున్నప్పటికీ తనిఖీలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో బెల్ట్ షాపుల వద్ద మద్యం సేవించడం,గుంపులుగా చేరి పార్టీలు చేసుకోవడం వల్ల మహిళలు,విద్యార్థులు,వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. గిరిజన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో యువత మద్యం వ్యసనానికి బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్నా ఎక్సైజ్ శాఖ ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ మద్యం విక్రయాలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి,సిండికేట్ వ్యవస్థను ఛేదించాలని,ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పామాయిల్ ఫ్యాక్టరీలో ప్రమాదం



-ఇద్దరికీ గాయాలు

**టీ మీడియా, జూలై 17, దమ్మపేట:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలోని ఎంఈఈ ప్లాంట్ వద్ద వేడి నీరు ప్రవహించే పైప్పు మరమ్మతు చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ 80 డిగ్రీల సెల్సియస్ వేడినీరు శరీరంపై పడటంతో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన కార్మికులను శివరామకృష్ణ, గణేశ్‌గా గుర్తించారు. గాయపడిన వీరికి ప్రాథమిక చికిత్స అందించి, ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

## కేజీబీవీలో సీట్ల భర్తీకి దరఖాస్తులు



**టీ మీడియా ,జులై 17, కూసుమంచి:**ఖమ్మం జిల్లా మండల కేంద్రం కూసుమంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ( కె జి బి వి ) నందు ఇంగ్లీష్ మీడియంలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ కి అర్హులైన బాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ అజిత కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ విద్యాలయంలో 6వ తరగతిలో 05 సీట్లు , 7వ తరగతిలో 02 సీట్లు ,8వ తరగతిలో 2 సీట్లు , 9వ తరగతిలో 3 సీట్లు, అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ( సి ఈ సి గ్రూపు ) నందు 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హత , ఆసక్తి గల విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మా విద్యాలయంలో చేరిన విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యతో పాటు పూర్తి సురక్షితమైన వసతి గృహ సదుపాయం, మెనూ ప్రకారం ప్రతిరోజు రుచికరమైన పౌష్టికాహారం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, యూనిఫార్ములు ప్రభుత్వం తరఫున కల్పించబడ్డాయని పేర్కొన్నారు. మహిళా సిబ్బంది పర్యవేక్షణలో అత్యుత్తమ భద్రతతో పాటు విద్యార్థినులలో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, ప్రత్యేకంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు వెంటనే పాఠశాల పనిదినములలో అవసరమైన ధృవీకరణ పత్రాలతో కూసుమంచి కేజీబీవీ విద్యాలయాన్ని నేరుగా సందర్శించి దరఖాస్తులు సమర్పించవలసిందిగా స్పెషల్ ఆఫీసర్ అజిత కుమారి కోరారు.



## ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలి.

### కలెక్టర్ దివాకర టి ఎస్. సూచన

**టీ మీడియా ,జులై 17 ,కూసుమంచి:**ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున వరి సాగును పరిమితం చేసి రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సూచించారు. భీరోలు నుంచి కూసుమంచి మండలానికి వెళ్తున్న సందర్భంగా శుక్రవారం పోచారం గ్రామంలో రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ ఏడాది సాధ్యమైనంత వరకు వరి పంట వేయకుండా ఉండాలని, ఒకవేళ సాగు చేసినా పరిమిత స్థాయిలో మాత్రమే సాగు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం రైతులకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోచారం రైతులు కోతుల బెడద తీవ్రంగా ఉందని, పంటలను ధ్వంసం చేస్తున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తహసీల్దార్, గ్రామ సర్పంచ్ సమన్వయంతో కోతుల సమస్య నివారణకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యూరియా పంపిణీపై మాట్లాడుతూ, యూరియా యాప్ సమర్థంగా పనిచేస్తోందని తెలిపారు. కూసుమంచి మండలానికి 20,400 యూరియా బస్తాలు బుక్ చేయగా, ఇప్పటికే 19,600 బస్తాలు సరఫరా జరిగిందని,, మరో 800 బస్తాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. యూరియా యాప్కు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓ) సంప్రదించాలని రైతులకు సూచించారు. అలాగే కొంతమంది రైతులు కాలువ పక్కనే ఉన్నప్పటికీ తమ చెరువుకు నీరు అందడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి. పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్యా సంస్థల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి

### ఐద్వా వాస్తవ నిర్ధారణ బృందం

**టీ మీడియా,జులై17,సింగరేణి(కారేపల్లి):**ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)వాస్తవ నిర్ధారణ బృందం డిమాండ్ చేసింది. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని సింగరేణి మండలం మాణిక్యారం,కోమట్లగూడెం,గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఐద్వా తెలంగాణ వ్యవసాయ కార్మిక బృందం శుక్రవారం పర్యటించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు,తాగునీరు,మరుగుదొడ్లు,తరగతి గదులు,ఇతర అవసరాలపై ఆరా తీసింది. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు,నాయకులు కేశగాని ఉపేందర్,యనమనగండ్ల రవి,కొండబోయిన ఉమావతి,కరపాటి సీతమ్మ, నీలిమ,సరూప,జ్యోతి,కలమ్మ,మల్లమ్మ,అరుణ,విజయ,శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10 జైల్ భరో



-సీఐటీయూ పిలుపు

**టీ మీడియా,జులై17,సింగరేణి (కారేపల్లి):** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడాన్ని నిరసిస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ ఖమ్మం జిల్లా కోశాధికారి చలమాల విటల్ పిలుపునిచ్చారు. సింగరేణి మండల గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జనరల్ బాడీ సమావేశం మండల అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చలమాల విటల్ మాట్లాడుతూ,కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయమని విమర్శించారు. లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల హక్కులు దెబ్బతింటాయని,రైతు వ్యతిరేక విధానాలు,విద్యుత్ చట్టం,కనీస మద్దతు ధరపై హామీలు అమలు కాకపోవడం,ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యల వల్ల కార్మికులు,రైతులు,వ్యవసాయ కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే.నరేంద్ర,జిల్లా నాయకులు ఎర్రుపల రాములు,గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,మండల కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు,ఉపాధ్యక్షుడు బోళ్ల కొమరయ్య,కోశాధికారి శీను,సుక్య,వట్టం సత్యం, కే.లోతు మురళి,బానోతు మోతి,శంకర్,బ్రహ్మం,యాదగిరి,పాలిక తిరపయ్య,పాపియా,రవి,సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా వీరబాబు, నరసింహ



**టీ మీడియా ,జులై 17, కూసుమంచి:**అఖిల భారత యువజన సమాఖ్య ( ఏ ఐ వై ఎఫ్ ) కూసుమంచి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మండలంలోని ఉడతలగూడెం గ్రామానికి చెందిన ఉడత వీరబాబు, లాల్ సింగ్ తండా కి చెందిన భూక్యా నరసింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లాల్ సింగ్ తండా లో గురువారం ఏ ఐ వై ఎఫ్ మండల మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ మహాసభలో వీరితో పాటు ఉపాధ్యక్షులుగా జిల్లా నాగరాజు, భూక్యా మోహన్ సహాయ కార్యదర్శులుగా గుండెపంగు మధు, బెల్లి హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా జిల్లా లింగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అల్లి వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మరో 18 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏ ఐ వై ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఉడత వీరబాబు, భూక్యా నరసింహ మాట్లాడుతూ.. యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. నిరుద్యోగం, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై యువతను చైతన్యపరిచి, ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని వారు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. సమైక్యను గ్రామస్థాయి నుండి యువతను సంఘటితంగా బలోపేతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఎన్నికైన కూసుమంచి మండల ఏ ఐ వై ఎఫ్ నూతన కమిటీ నీ వలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తూ,వారి నాయకత్వంలో ఏ ఐ వై ఎఫ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలోఅవగాహన సదస్సు



**టి మీడియా, జులై17, ఖమ్మం రూరల్:**ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులు కు సిబ్బంది పకృతి విపత్తులైన వరదలు, భూకంపాలు, తుఫానులు, కొండచరియలు విరిగిపడటం మరియు రసాయన/రేడియోధార్మిక ప్రమాదాల వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా సహాయక చర్యలు ఎలా చేపట్టాలి అనేదానిపై ప్రత్యేకమైన డ్రిల్ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు అంతేకాకుండా రెస్క్యూ ఆపరేషన్లు కూలిపోయిన భవనాల శిథిలాల కింద ఉన్నవారిని వెతకడం, లోతైన నీటిలో పడిన వ్యక్తులను ఎలా కాపాడాలి నీటి లో మునిగి పోకుండా మనం నిత్యం ఉపయోగించే కొన్ని వస్తులను ఎలా ఉపయోగించి నీటి లో మునకుంట ఉండచో అనే వాటిపై కొండచరియలు రైలు ప్రమాదాల సమయంలో శిథిలాల కింద ఉన్న మృతదేహాలను, మానవ అవశేషాలను పసిగట్టేందుకు వీలుగా ప్రత్యేక జాగ్రత్తలు విపత్తుల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి అనే దానిపై కూడా (జుఝుఎబ్ఘ్అశీఅ) ప్రత్యేకంగా వారి పద్ధతిలో విద్యార్థులకు ప్రాక్టికల్ గా చూపించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తహసిల్దార్ వినయేందర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ అనిత మాట్లాడుతు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల కు పకృతి విపత్తుల పై అవగాహన కల్పించడమే కాకుండా వారి యొక్క సమయస్ఫూర్తిని మరియు విజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం ఉందని ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు సమాజంలో మంచి గుర్తింపును తెస్తుందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ తహసిల్దార్ వినయేందర్ రెడ్డి మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబతిని అనిత వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస రెడ్డి వార్డు కౌన్సిలర్లు , సిబంది బీటన్ సింగ్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.